
పెరిగిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్







పారిశుధ్య పనుల పరిశీలన



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరానికి విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. జిల్లాలో తాజా పరిస్థితులపై వారితో చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.



నగర శివారులోని మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2023లో ప్రారంభమైన వంతెన పనులు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటికీ సగం పనులు కూడా పూర్తికాలేదు.
– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# అమ్మో.. ఆర్వోబీ..

- మాధవనగర్ వద్ద నరకప్రాయంగా ప్రయాణం
- భారీగుంతలు.. అస్తవ్యస్తమైన రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నలుగుతున్న వంతెన

నిజామాబాద్–హైదరాబాద్, ఇతర జిల్లాలకు వెళ్లేందుకు మాధవనగర్ రైల్వే గేట్ వద్ద 2023లో ఆర్వోబీ పనులు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే ప్రారంభించిన కొత్తలో వేగంగా జరిగిన పనులు ప్రస్తుతం పూర్తిగా మందగించాయి. నిర్మాణంలో భాగంగా రైల్వేగేట్‌కు ఇరువైపులా భారీ పిల్లర్లు, వాటి అనుసంధాన ప్రక్రియ జరుగుతోంది. పిల్లర్ల పైన దిమ్మెలు అమర్చినప్పటికీ ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

### రూ.93.12కోట్లతో ..

ఈ పనుల అంచనా వ్యయాన్ని రూ.93.12 కోట్లుగా నిర్ణయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం తమ వాటగా రూ. 30.05 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ63.07 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అలాగే ఆర్వోబీ నిర్మాణాన్ని సైతం రెండేళ్లలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు షరతులు విధించినప్పటికీ నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు నత్తకు నడక నేర్పేలా సాగుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్, ఇతర ప్రధాన నగరాలకు వెళ్లేందుకు మాధవనగర్ రహదారి ప్రధానమైంది. నిత్యం వేలసంఖ్యలో వాహనాలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రైల్వేగేట్ కారణంగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ఎన్నోసార్లు హైదరాబాద్‌కు అత్యవసర స్థితిలో వెళ్లాల్సిన అంబులెన్స్‌లు ఈ రైల్వేగేట్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి కట్టాలని నిర్ణయించారు. అయితే పనులు సాగకపోవడం, రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### వర్షా కాలంలో ప్రయాణం..నరకం..

రైల్వేగేట్ వద్ద ఇరువైపులా అప్రోచ్ రోడ్లపై కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాడని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండువైపులా రోడ్లపై భారీ గుంతలు ఏర్పడడంతో అరకిలోమీటర్ కూడా ఉండని ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తోందని వారంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళ్లలో ఈ మార్గంలో రావాలంటేనే జంకుతున్నారు. గుంతల మయమైన ఆ రోడ్డు నుండి కిందామీద పడి రైల్వే గేటు వద్దకు వచ్చేసరికి లెక్కలేనన్నిసార్లు గేటు పడుతుందని, అక్కడ తమ సమయం అంతా హరించుకుపోతుందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే అప్రోచ్ రోడ్లను బాగు చేయించి.. ఆర్వోబీని పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్ర ప్రభుత్వం కారణంగానే..

ఈ ఆర్వోబీపై అనేకసార్లు ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఇవ్వాల్సిన వాట రూ.30 కోట్లకు పైగా ఎప్పుడో ఇచ్చేశామని.. కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్లే ఆర్వోబీకి ఈ పరిస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయంలో ప్రారంభమైన ఈ నిర్మాణం.. కాంగ్రెస్ సర్కారు హయాంలోనూ నిర్లక్ష్యానికి గురువుతోందని ఆయన విమర్శించారు.

### ఇటీవల నిధుల విడుదల

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఇటీవల కలెక్టరేట్‌లో ఆర్వోబీపై సమీక్ష నిర్వహించారు. నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న ఆయన యుద్ధప్రాతిపదికన రూ.3.15కోట్ల నిధులు విడుదల చేయించారు. ఆర్వోబీ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, బ్లాక్ లిస్ట్‌లో పెడతామని ఆయన కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తికావాల్సిన ఆర్వోబీ నాలుగేళ్లయినా పూర్తికాకపోవడంతో నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా రాజా గౌడ్



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా రాజా గౌడ్ బదిలీపై రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా విధులు నిర్వహిస్తున్న రాజా గౌడ్‌ను నిజామాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం నియమించింది. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. రాజా గౌడ్ గతంలో బోధన్ ఆర్డీవోగా పనిచేశారు. దీంతో నిజామాబాద్ జిల్లా భౌగోళిక పరిస్థితులు, రెవెన్యూ వ్యవస్థపై ఆయనకు ఇప్పటికే అవగాహన ఉంది. గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ప్రస్తుత బాధ్యతల్లో ఉపయోగపడుతుందని అధికారులు, సిబ్బంది భావిస్తున్నారు.




## నెలాఖరులోగా మండల కాంగ్రెస్ కమిటీల నియామకం: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో నెలాఖరులోగా మండల కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని దుబ్బలో ఉన్న ఎంకే గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత పీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలకు వివిధ స్థాయిల్లో ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలిపారు. ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అధికంగా జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, బూత్‌స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మండల కాంగ్రెస్ కమిటీల నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శెట్కార్, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, మల్లికార్జున్, గడుగు గంగాధర్, ఆకుల లలిత, విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కుటుంబాన్ని ఆదుకుంటాం: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే,నిజామాబాద్ క్రైం:** ఆకస్మికంగా మృతిచెందిన రెంజల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ తలారి తిరుపతి కుటుంబానికి అండగా ఉంటామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. బుధవారం కానిస్టేబుల్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తలారి తిరుపతి విధుల్లో భాగంగా ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో ఉన్నాడు. అయితే ఆయనకు మంగళవారం ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు ఆర్మూర్‌లో నిర్వహించగా సీపీ సాయిచైతన్య హాజరయ్యారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తలారి తిరుపతి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రెంజల్ ఎస్సై గంగాధర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకిల్ పాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్ అభివృద్ధిలో కాంగ్రెస్ నిర్లక్ష్యంపై పోరాటం: ప్రశాంత్‌రెడ్డి

**అక్షరటుడే, భీమ్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో భీమ్‌గల్‌లో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.కోట్లు మంజూరు చేసి ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ భీమ్‌గల్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మూడు నెలల్లో 100 పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ , బస్సు డిపో పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. భీమ్‌గల్ అభివృద్ధి, పెండింగ్ పనులపై తాను గతంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా స్పందన లేకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని, తనను పోలీసులు అరెస్టు చేసి అడ్డుకున్నారని ఆయన గుర్తుచేశారు. రూ.35 కోట్ల బడ్జెట్‌తో మంజూరైన 100 పడకల ఆస్పత్రి నిర్మాణంలో సుమారు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నెమ్మదించాయని ఆరోపించారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజల తరపున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ పనులకు నిధులు విడుదల చేసి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



## నగరంలో పాలిటెక్నిక్ విద్యార్థుల భారీ ర్యాలీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేసేవిధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలను వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు నినదించారు. నగరంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఉంచి సుభాష్‌నగర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొదట పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. అయితే గేటు తోసుకుని వచ్చిన విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్ వచ్చి సమాచారం చెప్పేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.


## పోచారం మాకొద్దు.. బాన్సువాడ కాంగ్రెస్ నాయకుల నిరసన



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు హల్‌చల్ చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బప్రాంతంలోని ఎంకే గార్డెన్‌లో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క హాజరయ్యారు. అయితే ఈ సమావేశానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం నాయకులు గార్డెన్ ఎదుట బైఠాయించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తమకు అవసరం లేదని నినదించారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. బాన్సువాడలో పోచారం తీరుతో కాంగ్రెస్ పార్టీతో తీవ్ర నష్టం ఏర్పడుతోందన్నారు. ఆయన నిర్ణయాల కారణంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి తొలగించాలని పేర్కొంటూ ధర్నాకు దిగారు.

## అటవీ సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్‌పల్లి, కాల్పోల్ తండా, డీబీతండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు సహకరించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మండలంలోని జంగమాయపల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలనే విషయాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుబ్రహ్మణ్య చారి, సర్పంచ్ రాములు, ప్యాక్స్ ఛైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, ఉప సర్పంచ్ సిద్ధి రాములు, సెక్రటరీ ప్రదీప్, వీపీవో వెంకట రమణ పాల్గొన్నారు.

## హాస్టల్‌లో ఎంపీవో ఆకస్మిక తనిఖీలు




**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) రెసిడెన్షియల్ బాలుర, బాలికల పాఠశాల, హాస్టల్‌ను ఎంపీవో గంగామోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. తాగునీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఆయన తరగతి గదుల్లో విద్యాబోధన తీరును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి మోహన్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సౌధా ఎదుట ఉద్యోగుల మహాధర్నా



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** 'చలో విద్యుత్ సౌధా' పిలుపులో భాగంగా తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధా ఎదుట ఉద్యోగులు బుధవారం పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ సాయిబాబా, జనరల్ సెక్రెటరీ శ్రీధర్, కన్వీనర్ రత్నాకర్ రావు, కోకన్వీనర్ బీసీ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా నుంచి జేఏసీ నాయకులు రఘునందన్, పూదరి గంగాధర్, ప్రసాద్ రెడ్డి, కాశీనాథ్, తోట రాజశేఖర్, గంగారాం నాయక్, చంద్రశేఖర్, రాజేందర్ గౌడ్, వేణుగోపాల్, డీసీ రాజు, శివ ప్రసాద్, రాజేందర్ రెడ్డిలతో పాటు జిల్లాలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్లకు చెందిన దాదాపు 800 మంది ఉద్యోగులు భారీగా తరలివెళ్లి పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ భరోసాను పెంచింది. ఏళ్ల తరబడి సేవలందించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ సమయంలో అందే రిటైర్మెంట్ బెనిఫిట్ రెట్టింపు చేసింది. 60 ఏళ్లు దాటిన వారు స్వచ్ఛందంగా విధుల నుంచి విరమించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. ఈ నిర్ణయం ద్వారా వృద్ధాప్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి ఆర్థిక భరోసా లభించడంతో పాటు, కొత్త వారికి ఉద్యోగ అవకాశాలు కూడా పెరగనున్నాయి.
- అక్షరటుడే, ఎల్లారెడ్డి




# పెరిగిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్

■ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు గుడ్‌న్యూస్ ■ 60 ఏళ్ల తర్వాత స్వచ్ఛంద విరమణకు అవకాశం ■ ఇప్పటికే పలువురికి నిధులు జమ

నిజామాబాద్ జిల్లాలో 1,501 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3,002 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. 76 అంగన్వాడీ టీచర్లు, 103 ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇంకా 527 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 1,195 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ 2,390 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా 95 అంగన్‌వాడీ టీచర్లు 95 ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, వాటి భర్తీకి గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు.

### టీచర్లకు రూ.2 లక్షలు

ప్రభుత్వం 2023లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్ కు రూ.లక్ష, హెల్పర్ కు రూ.50 వేలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఉండేది. దీనిని గతేడాది మేలో ప్రభుత్వం రెట్టింపు చేసింది. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల కొత్త జీవోను అమలులోకి తీసుకొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఖాతాలో ప్రభుత్వం మొత్తం రూ.15.61 కోట్ల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ జమ చేసింది. ప్రభుత్వం పెంచిన బెనిఫిట్స్ జమ చేస్తుండటంతో అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## యూరియా యాప్‌లో సాంకేతిక లోపంతో రైతుల అవస్థలు

**అక్షరటుడే, లింగంపేట:** మండలం శెట్టిపల్లి సంగారెడ్డి సొసైటీ వద్ద బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సొసైటీలో 50 బస్తాలుంటే 200 బస్తాలు యాప్‌లో బుక్ అయినట్లు తెలిపారు. తీరా సొసైటీకి వస్తే యూరియా బస్తాలు లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఏవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సాంకేతిక లోపంతో యూరియా యాప్‌లో రైతులు బుక్ చేసిన యూరియా బస్తాలు తొలగించకుండా అలాగే చూపించిందన్నారు. దీంతో రైతులు తిరిగి యూరియా బస్తాలను బుక్ చేసుకున్నారని చెప్పారు.. ఇప్పటివరకు సుమారు 274 బస్తాల యూరియా అదనంగా బుక్ అయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యను మా తమబ్బంది పరిష్కరించనున్నట్లు ఏవో వెల్లడించారు. కాగా యూరియా లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లూయిస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రతి ఒక్కరి చేతిలో కెమెరా అందుబాటులోకి వచ్చిందన్నారు. నిన్నటి జ్ఞాపకాలను పదిలపరుస్తూ, నేటి వాస్తవాలను ప్రపంచానికి చూపిస్తూ, రేపటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే చిత్రాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవన్, కార్యదర్శి సంపత్, కోశాధికారి నర్సయ్య, క్రాంతి, శ్రీకాంత్ అమీర్, అజయ్, గౌతమ్, ముత్తు, సుమంజన్, సమీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




## తహశీల్దార్‌కు సన్మానం



**అక్షరటుడే,పెద్దకొడప్‌గల్:** ఉత్తమ తహశీల్దార్‌గా రాజశేఖర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పెద్ద కొడప్‌గల్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ తహశీల్దార్ రాజశేఖర్ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముందుంటారని పేర్కొన్నారు. ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపిక కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా నుడా ఛైర్మన్ జన్మదిన వేడుకలు




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నుడా ఛైర్మన్ కేశ వేణు జన్మదిన వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించారు. 'కేశ వేణు అన్న' యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే నీలకంఠేశ్వర మందిరం, పాత మున్సిపల్ ఆఫీస్, వినాయకనగర్ రుక్మిణీ ఛాంబర్ వద్ద అన్నదానం చేశారు. గుండారంలోని నిర్మల భవన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేశ మహేష్, సిరిగిరి తిరుపతి, బింగి మధు, కోర్వా రాజు, దేవిదాస్, ప్రవీణ్, సుజిత్, గాలి ప్రసాద్, ఆమీర్, నోమన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాలల హక్కుల పరిరక్షణకు ఏకమవ్వాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** మాలల హక్కుల పరిరక్షణకు ఏకమవ్వాలని ఆలూరు మాల మహానాడు మండల అధ్యక్షుడు అగ్గు క్రాంతి పేర్కొన్నారు. బుధవారం మహానాడు ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. 2014లో 23 లక్షలుగా ఉన్న మాలల జనాభాను ప్రస్తుతం 15 లక్షలుగా చూపించి ఆర్థికంగా, రాజకీయంగా అణచివేసే కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. రోస్టర్ పాయింట్ విధానాన్ని వెంటనే సవరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాలలు సంఘటితమై ప్రభుత్వాన్ని నిలదీస్తారని హెచ్చరించారు. ఈనెల 23న ఆర్మూర్ వేదికగా మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పారిశుధ్య సమస్యపై స్పందించిన వార్డ్‌మెంబర్



**అక్షరటుడే, పోచంపాడ్:** పోచంపాడ్ గ్రామంలోని 10వ వార్డులో పిచ్చి మొక్కలు, పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో దోమలు, పాముల బెడద ఎక్కువవుతోందని స్థానిక ప్రజలు వార్డు సభ్యుడు నజీర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన బుధవారం తన సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేసి పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపారు. వార్డులో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకుని సమస్యను వెంటనే పరిష్కరించేందుకు సొంత ఖర్చుతో పనులు చేపట్టిన నజీర్‌ను స్థానిక ప్రజలు అభినందించారు.

## సాయ్ వాలీబాల్ అకాడమీకి అర్జున్ ఎంపిక



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పేట్ సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బస్సీ అర్జున్ సాయ్ వాలీబాల్ అకాడమీ సిద్దిపేటకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. జులై నెలలో జరిగిన ఎంపిక పోటీలో చూపిన ప్రతిభకు గాను ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వాలీబాల్ క్రీడలో ఉన్నత స్థాయికి ఎదగడానికి అకాడమీ శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారం




**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలకు గాను ఆయనను సన్మానించినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. బుధవారం బాలికల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌ను సన్మానించిన అనంతరం డీఐఈవో మాట్లాడుతూ.. అడ్మిషన్లు, ఫలితాలు, కళాశాలలో పచ్చదనం, పరిశుభ్రత, కళాశాల పాలన, నిర్వహణ, ఇతర సాంకేతిక, కళాశాల పనుల నిర్వహణలో ఉత్తమ సేవలకు ఆయనకు పురస్కారం లభించిందని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను పెంపొందించడంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పని తీరుకు ఫలితమే ఈ అవార్డు అని పేర్కొన్నారు. అధ్యాపకుల వల్లే 80శాతానికి పైగా ఫలితాలను సాధించామని, అలాగే 1400 అడ్మిషన్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'యశోద'లో విజయవంతంగా రోబోటిక్ సర్జరీలు




**అక్షరటుడే, కామారెడ్డి:** యశోద ఆస్పత్రి సికింద్రాబాద్ బ్రాంచ్‌లో ఆర్థోకు సంబంధించి రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.విక్రమ్ వైరి తెలిపారు. బుధవారం ఆయన కామారెడ్డి పట్టణంలోని యశోద బ్రాంచ్ మెడికల్ క్లినిక్‌లో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి కి చెందిన పెంటయ్య మోకాలి గుజ్జు అరిగిపోయి నడవలేని స్థితిలో నాల్గో స్టేజ్‌లో యశోద ఆస్పత్రికి వచ్చారన్నారు. అతనికి పరీక్షలు నిర్వహించి రోబోటిక్ సర్జరీ అవసరమని చెప్పామన్నారు. సర్జరీ గురించి అతనికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిన తర్వాత రోబోటిక్ ద్వారా సర్జరీ విజయవంతంగా నిర్వహించి మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఇంటికి పంపించామని తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా ఒక్కరోజులోనే ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందని, బ్లడ్ లాస్ ఉండదని, ఇంప్లాంట్స్ ఎక్కడ అమర్చేది తెలుస్తుందని, ఆపరేషన్ అయ్యాక ఆపరేషన్ చేశారన్న ఫీలింగ్ కూడా ఉండదన్నారు. ఈ సర్జరీ అనంతరం పేషంట్‌కు మానసిక ధైర్యం వస్తుందని పేర్కొన్నారు. క్లినిక్ మేనేజర్ శ్రీనివాస్, బాధితుడు పెంటయ్య పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను, వన మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పరిశీలించారు. మొదట 1వ, 17వ వార్డుల్లో కొనసాగుతున్న శానిటేషన్ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రోడ్లు, డ్రైనేజీల శుభ్రత తదితర అంశాలను పరిశీలించిన ఛైర్‌పర్సన్, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. అంతకుముందు 38వ వార్డులో నిర్వహించిన వన మహోత్సవ మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పాల్గొన్నారు. ప్రజలకు మొక్కలను పంపిణీ చేసిన అనంతరం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, లోలం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత రావు, ఏఈ వేణు ప్రసాద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.